క్లుప్తంగా

మహిళలకు ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీల్లో మహిళలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లులకు శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. శనివారం నిర్వహించనున్న 'మెగా పేరెంట్ మీట్'ను పురస్కరించుకుని పాఠశాల హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు నేతృత్వంలో ఈ పోటీలు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ ఉమ, హిందీ టీచర్ జి.నిర్మల, యోగా టీచర్ స్వాతి, ఐటీ ఇన్‌స్ట్రక్టర్ పల్లవి, ఆర్ట్ టీచర్ ఎన్.జ్యోతేష్, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. శనివారం విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకుడు చంద్రశేఖర్ తెలిపారు.

కార్పొరేటర్ కృషితో త్రినాథపురం రహదారికి మోక్షం

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురం నుంచి పోర్ట్ క్వార్టర్స్ మీదుగా సర్వీస్ రోడ్డుకు వెళ్లే అనుసంధాన మార్గానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. రహదారి సమస్యపై స్థానిక కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పలుమార్లు కౌన్సిల్ ద్వారా సంబంధిత అధికారులతో పాటు విశాఖ పోర్టు ట్రస్ట్ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు. పట్టు వదలకుండా రోడ్డు వేసే వరకు అధికారులకు ఫోన్ల ద్వారా గుర్తు చేస్తూనే ఉన్నారు. దీంతో జీవీఎంసీ అధికారులు, పోర్ట్ అధికారులు చర్చించి, సమస్యను పరిష్కరించారు. ఈ క్రమంలో రహదారి పనులకు పోర్టు అధికారులు సుమారు 48 లక్షల రూపాయల నిధులను కేటాయించి కాంట్రాక్టర్‌కు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో సదరు త్రినాథపురం-పోర్ట్ క్వార్టర్స్ రహదారి పనులను ప్రారంభించారు. దీంతో రహదారి రాకపోకలు సాగిస్తున్న పలు ప్రాంతాల ప్రజలు కార్పొరేటర్ లక్ష్మణరావుకు ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ సిబ్బందికి సన్మానం

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు కరాస, న్యూ కరాసలో వీధి లైట్ల నిర్వహణలో పాల్గొంటున్న విద్యుత్ సిబ్బందికి వార్డు పెద్దలు శుక్రవారం సన్మానం చేశారు. కాలనీల్లో వీధి లైట్లు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను కాలనీ పెద్దలు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించారు. జీవీఎంసీ వీధిలైట్ల విభాగం అధికారులు శుక్రవారం ఆయా ప్రాంతాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. దీనిపై సంతోషం వ్యక్తం చేసిన కాలనీ పెద్దలు ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు సంతోష్, వినయ్, కైలాష్‌కు సన్మానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ సిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వైటీఆర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం


దేవతామూర్తుల ఊరేగింపులో కలశాలతో పాల్గొన్న మహిళలు

సింథియా: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం రెడ్డివీధిలో ఏకదశ దేవాలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. దాతల సహాయంతో ఆలయ పునర్నిర్మాణం అనంతరం శ్రీశ్రీ కోదండ సీతారామ శ్రీరామలింగేశ్వర, శ్రీ గౌరీపరమేశ్వర, శ్రీ లక్ష్మీప్రసన్న వేంకటేశ్వర, శ్రీ గాయత్రి, శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ సంతోషిమాత, శ్రీ అయ్యప్ప స్వామి, శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, శ్రీ దాసాంజనేయ, శ్రీ షిరిడి సాయిబాబా శిలా విగ్రహ ప్రతిష్టను శాస్త్రోక్తంగా నిర్వహించారు. విగ్రహాల ఊరేగింపులో స్థానిక మహిళలు కలశాలతో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో గణపతి హోమం, వేదపారాయణ, జలాదుద్ధరణ, క్షీరాధివాసం, గాయత్రి హోమం, నీరాజన మంత్ర పుష్పం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భౌ..బోయ్..

కరిచేస్తున్నాయ్


63వ వార్డులో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

- 40, 63 వార్డుల్లో శునకాల స్వైరవిహారం
- వెంటాడి, కరిచేస్తున్న వైనం
- బెంబేలెత్తిపోతున్న జనం
- వీధికుక్కల నియంత్రణకు విన్నపం


40వ వార్డు షిప్‌యార్డ్ కాలనీలో వీధి కుక్కల స్వైర విహారం


ఇటీవల వీధి కుక్కల దాడిలో మహిళ కాలికి అయిన గాయం

సింథియా: జీవీఎంసీ 40, 63 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో వీధికుక్కల స్వైర విహారంతో స్థానికులు హడలిపోతున్నారు. విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలపై మూకుమ్మడి దాడులకు పాల్పడడంతో రోడ్లపైకి రావాలంటేనే భయపడిపోతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులను ఒంటరిగా బయటికి పంపాలంటేనే భయంగా ఉంటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏకేసీ కాలనీ, చింతల్లోవ, క్రాంతినగర్, జయేంద్ర కాలనీ, త్రినాథపురం, దుర్గానగర్, గుడివాడ అప్పన్న కాలనీ, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లోని వీధుల్లో శునకాలు గుంపులు, గుంపులుగా తిరుగుతుండడంతో ఇళ్ల నుంచి బయటికి రావాలంటే బెంబేలెత్తిపోతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని కుక్కలు వెంబడించడంతో వాహనదారులు పలు ప్రమాదాలు గురవుతున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం ఉండడం లేదని ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియంత్రణకు చర్యలు కరవు

వీధి కుక్కల నియంత్రణపై అధికారులు దృష్టి సారించడం లేదని స్థానికులు వాపోతున్నారు. వీధి కుక్కలను గుర్తించి, డాగ్ క్యాచర్స్ ద్వారా పట్టుకుని పశుసంవర్థక శాఖ వైద్యుల ద్వారా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తే కుక్కల నియంత్రణ సాధ్యమవుతుందని, కానీ.. అధికారులు ఆ దిశగా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వ్యకం చేస్తున్నారు. ఇక పశుసంవర్థక శాఖ తీరు 'కందకు లేని దురద కత్తి పీటకెందుకు' అన్నట్లుగా జీవీఎంసీ పట్టించుకోకపోవడంతో, వీధికుక్కల నియంత్రణ మాకెందుకులే అన్నట్లు నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అందుబాటులో వ్యాక్సిన్లు

కుక్క కాటుతో గాయపడిన వారికి ర్యాబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారులు తెలిపారు. జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలోని యూపీహెచ్‌సీలో సుమారు 60 వ్యాక్సిన్లు, 63వ వార్డు క్రాంతినగర్ యూపీహెచ్‌సీలో 70, గుల్లలపాలెం ప్రభుత్వాస్పత్రిలో 200 వరకు ర్యాబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

6 నెలల్లో కుక్క కాటుకు గురైనవారు

గడిచిన ఆరు నెలల్లో వార్డులోని వివిధ ప్రాంతాల్లో కుక్కకాటుకు గురై శ్రీహరిపురం గుల్లలపాలెం ప్రభుత్వాసుపత్రిలో, క్రాంతినగర్ యూపీహెచ్‌సీ, 40వ వార్డు ఏకేసీ కాలనీలోని యూపీహెచ్‌సీల్లో పలువురు చికిత్స పొందారు. రెండు వార్డుల్లో ప్రభుత్వాసుపత్రుల్లోనే కుక్కకాటుకు గురైన వారి సంఖ్య ఈ స్థాయిలో ఉంటే, ఇక ప్రైవేటు అస్పత్రులు, ఇతర వార్డుల్లో పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

నెల	క్షతగాత్రులు
జూన్	15
జూలై	23
ఆగస్ట్	21
సెప్టెంబర్	11
అక్టోబర్	15
నవంబర్	13

బయటకు వెళ్లాలంటేనే భయం



మా ప్రాంతంలో వీధి కుక్కలు చాలా ఎక్కువగా ఉన్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు బయటకు వెళ్లినా గుంపులు గుంపులుగా తిరుగుతూ మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి. ఇటీవల మా వీధిలో ఒక మహిళ వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెంబడించి మరీ ఆమె కాలిని గాయపరిచాయి. అప్పటి నుంచి బయటకు రావాలంటేనే భయమేస్తోంది. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

– సుజాత, ప్రకాష్‌నగర్

మా ప్రాంతాల్లో వదిలేస్తున్నారు



ఎక్కడి నుంచో కుక్కలను తీసుకువచ్చి మరీ మా ప్రాంతాల్లో వదిలేస్తున్నారు. దీంతో ఆ కుక్కలు .. చిన్నపిల్లలు వీధుల్లోకి రాగానే వెంబడించి మరీ గాయపరుస్తున్నాయి. వాహనదారులను వెంబడించడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించాం. కానీ వీధి కుక్కల నియంత్రణకు చర్యలు మాత్రం తీసుకోవడంలేదు.

– లక్ష్మి, 63 వ వార్డు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ గోడ


రక్షణ గోడ నిర్మిస్తున్న దృశ్యం



సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు సుసర్ల కాలనీలో అన్నా క్యాంటీన్‌కు వెళ్లే దారిలో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు జీవీఎంసీ అధికారులు ఎట్టకేలకు రక్షణ గోడ నిర్మిస్తున్నారు. ఇక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మరఖ ఫ్యూజ్ వైర్లు కిందకు వేలాడుతుండటంతో అటుగా వెళ్లేవారు భయాందోళనల నడుమ ప్రయాణిస్తున్నారు. ఈ సమస్యపై నవంబర్ 25న 'తస్మాత్ జాగ్రత్త' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై జీవీఎంసీ అధికారులు స్పందించారు. ఫ్యూజ్ వైర్లు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడ నిర్మిస్తున్నారు. ఎన్నో రోజులుగా ఉన్న ఈ సమస్యకు సాక్షి కథనం ద్వారా పరిష్కారం లభించిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మేమింతే..!

రోడ్డుపై ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్



బీఆర్‌టీఎస్ రోడ్డుపై నిలిపిన బస్సులు

విశాఖ విద్య: నిత్యం రద్దీగా ఉండే ఎన్ఏడీ–గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్డులో వాహనాలను ఇష్టానుసారం పార్క్ చేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. బాజీ జంక్షన్‌లోని ఓ పాఠశాల తమ బస్సులను రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్డుపైనే గంటల తరబడి నిలుపుతోంది. స్కూల్ విడిచిపెట్టే సమయంలో బస్సులను రోడ్డుపైనే ఉంచి, విద్యార్థులను ఎక్కించుకుంటున్నారు. ఓ పక్క వందలాది మంది విద్యార్థులు స్కూల్ ప్రాంగణం నుంచి ఒకేసారి రోడ్డుపైకి రావడం, ఇదే సమయంలో అక్కడే బస్సులను నిలపడంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఆ దారిలో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. స్కూల్ నిర్వాహకుల తీరుపై పలువురు ఫిర్యాదు చేసినా, యాజమాన్యం పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

28, 29 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు


మహాసభల వివరాలు వెల్లడిస్తున్న సీపీఎం నాయకుడు జగన్

గోపాలపట్నం: ఈ నెల 28, 29 తేదీల్లో పెందుర్తి మండలం సుజాతానగర్‌లో నిర్వహించనున్న సీపీఎం విశాఖ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ గోపాలపట్నం జోన్ కార్యదర్శి డి.జగన్ కోరారు. ఈ మేరకు గోపాలపట్నం సీఐటీయూ జోన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం అభివృద్ధి కోసం, స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల రక్షణ కోసం సీపీఎం ఉద్యమాలు చేస్తోందన్నారు. విద్యుత్ చార్జీలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ పెరుగుదలపై ఉద్యమిస్తున్నామని ప్రజలకు అండగా ఉంటున్నామని తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని, ప్రజలు విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.రమణి, బి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి శూలాల మహోత్సవం


ఉత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్ కాలనీలో సుబ్రహ్మణ్య స్వామి మాలధారులు శూలాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏకేసీ కాలనీ నుంచి షిప్‌యార్డ్ కాలనీ క్వార్టర్స్ మీదుగా ఊరేగింపు సాగింది. ఊరేగింపులో పాల్గొన్న భక్తులకు 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పాలు, పండ్లు పంపిణీ చేశారు. గతంలో షిప్‌యార్డ్ కాలనీ పాత శివాలయానికి వెళ్లే రహదారి పూర్తిగా పాడై, ఆలయానికి వెళ్లాలంటే భక్తులు, స్థానికులు ఇబ్బంది పడేవారు. దీంతో స్థానిక కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు జీవీఎంసీ ఉన్నతాధికారులతో మాట్లాడి నూతన రోడ్డు నిర్మాణానికి కృషి చేశారు. దీంతో ఈ ఏడాది సుబ్రహ్మణ్య స్వామి భక్తులకు రోడ్డు సమస్య తీరి, ఆనందోత్సాహాలతో ఊరేగింపు నిర్వహించుకున్నారు. వారంతా కార్పొరేటర్ నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు.

షష్టి మహోత్సవానికి సర్వం సిద్ధం

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు


సుబ్రహ్మణ్యేశ్వర స్వామి


రథోత్సవానికి సిద్ధం చేసిన రథం


ఎన్ఏడీ కొత్తరోడ్‌లో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ముందు భారీ టెంట్లు

విశాఖ విద్య: ఎన్ఏడీ సమీపంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి షష్టి మహోత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ఆలయంలో శనివారం ఉదయం 8.30గంటలకు కల్యాణం జరిపిస్తారు. సాయంత్రం 5.30గంటలకు నిర్వహించనున్న తిరువీధి ఉత్సవానికి రథాన్ని సిద్ధం చేశారు. చారిత్రాత్మక ఆలయం కావడంతో ఎన్ఏడీతో పాటు చుట్టుపక్కల కాలనీల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఆలయ కమిటీ ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ సమీపంలో భారీగా టెంట్లు నిర్మించి, ఆలయంతో పాటు, ఎన్ఏడీ సెంటర్ వరకు విద్యుత్ దీపాలను అమర్చారు. ఆలయ ధర్మకర్త ఆర్.మాణిక్యం ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 8న మధ్యాహ్నం అయ్యప్ప స్వాములకు అన్నసంతర్పణ, అదే రోజు సాయంత్రం 6గంటలకు జ్యోతిర్లింగార్చన (వెయ్యిదీపాలతో) ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

చంద్రమౌళీశ్వర ఆలయంలో..

జీవీఎంసీ 90వ వార్డు సుసర్లకాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీలో కొలువుదీరిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దివ్య కల్యాణోత్సవానికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం తెల్లవారుజాము నుంచే ఆలయంలో స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించనున్నారు. ఉదయం 9గంటలకు ఆలయ ప్రాంగణంలో కల్యాణ వేడుక ప్రారంభమతుందని, భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర ఇచ్చారపు, శ్రీనివాసరాజు కోరారు. సాయంత్రం పల్లకి సేవ ఉంటుందన్నారు.

'సౌందర్యలహరి అనుసృజన' ఆవిష్కరణ

సీతంపేట: విశాఖ సాహితి ఆధ్వర్యంలో రచయితలు అత్రేయపురపు పాండురంగ విఠల్ ప్రసాద్, వేదుల కామేశ్వర శర్మ సంయుక్తంగా శ్రీశంకరాచార్య విరచిత సౌందర్యలహరి అనుసృజన పుస్తకావిష్కరణ సభ లలితానగర్‌లోని శ్రీలలితాపీఠంలో జరిగింది. ప్రముఖ శతక పద్య కవి కంటి శంకరయ్య ముఖ్య అతిథిగా హాజరై పుస్తకావిష్కరణ చేశారు. విశాఖ సాహితి అధ్యక్షురాలు కందాల కనక మహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.వి. సూర్యారావు పుస్తక సమీక్ష చేశారు. సాహితీవేత్తలు పింగళి జానకి, పరవస్తు పద్యపీఠం అధ్యక్షుడు ఫణిశయన సూరి, విశాఖ సాహితి కార్యదర్శి శంకర్ నీలు భాగవతుల, వేదుల శ్రీనాథ శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్. రామారావు, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ జూలి కర్మాకర్ సిబ్బందితో కలిసి శుక్రవారం రైల్వేస్టేషన్ వివిధ ప్లాట్‌ఫాంలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో తమిళనాడు రాష్ట్రం, మధురై జిల్లాకు చెందిన రమార్ సెల్లం అక్రమంగా గంజాయి రవాణా చేయడం గుర్తించి, అతన్ని అదుపులోకి తీసుకుని ఎస్ఐ రామారావుకు అప్పగించారు. ఇతని వద్ద నుండి రూ. 86 వేల విలువైన 17.3 కేజీల గంజాయిని సీజ్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్‌పీ సిబ్బంది తెలిపారు.

దార్శనికుడు అంబేడ్కర్

వర్ధంతి సందర్భంగా రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు


సింహాచలం ఆర్టీసీ డిపో వద్ద నివాళులర్పిస్తున్న జైభీమ్ అసోసియేషన్ కమిటీ సభ్యులు


లక్ష్మీనగర్ ఈ బ్లాక్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చీఫ్ విప్ గణబాబు


62వ వార్డులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు


కాకరలోవలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ నాయకులు


59వ వార్డులో అంజలి ఘటిస్తున్న విశాఖ ఇండస్ట్రియల్ కాంట్రాక్ట్ అండ్ లేబర్ యూనియన్


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దళిత కుల పోరాట సమితి నాయకులు

గోపాలపట్నం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పశ్చిమ నియోజకవర్గ పరిధిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

- లక్ష్మీనగర్ ఈ బ్లాక్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే, చీఫ్ విప్ గణబాబు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆలోచనలు, ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని, అనుసరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక దళిత సంఘాల నాయకులు బంగారు తులసీ రామ్, ఎప్పటి శివ, దుర్గేష్, శ్రీనివాస్, అలజంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- విశాఖ జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ జైభీమ్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. సింహాచలం ఆర్టీసీ డిపో వద్ద అసోసియేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి అసోసియేషన్ కమిటీ జిల్లా కార్యదర్శి యల్లపు రాంబాబు నివాళులర్పించారు. కార్యక్రమంలో సింహాచలం డిపో అధ్యక్షుడు పి.వి.ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి గొల్ల సోములు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.గురయ్య, సింహాచలం డిపో కార్యదర్శి కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో..

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి ప్రకాష్‌నగర్, ఎస్సార్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో రావాడ అప్పారావు, ఈశ్వరరావు, ప్రభాకర్, జీవన్, బాబూరావు, కాలనీ గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు, వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

- 59వ వార్డు కొత్త నక్కవానిపాలెంలోని విశాఖ ఇండస్ట్రియల్ కాంట్రాక్ట్ అండ్ లేబర్ యూనియన్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి దేవర అప్పలరాజు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నరేంద్ర, దేవర శ్రీనివాస్, పెద్దాడ గిరిష్, గొలగాని వెంకట రమణ, అమిశెట్టి వెంకటేష్, ఉరుకూటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవ, మల్కాపురం ప్రాంతాల్లో దళిత పోరాట సమితి నాయకులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో గుడాల రాంబాబు, టి.కామేశ్వరరావు, కనకరాజు, శంకరరావు, సత్యనారాయణ ఇతర నాయకులు పాల్గొన్నారు.
- 63వ వార్డు కాకరలోవ ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు కొట్నాన రవి, ప్రధాన కార్యదర్శి పునుకు రమణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సర్వేశ్వరరావు, ఎల్లయ్య, కృష్ణ, వేణు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ ఎనర్జీ మీటర్ టెక్నీషియన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ ఎనర్జీ మీటర్ టెక్నీషియన్ కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌పీఎస్ఎస్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసి 18 నుండి 45 ఏళ్ల వయసు కలవారు అర్హులన్నారు. మూడు నెలల పాటు పెదగంట్యాడలోని నేక్ కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు 80390 03957 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కులశేఖర్ మరణం తీరని లోటు


కులశేఖర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సొసైటీ ప్రతినిధులు

సీతంపేట: సినిమా గేయ రచయిత కులశేఖర్ మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటు అని పలువురు సంతాపం వ్యక్తం చేశారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ద్వారకా నగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం సంస్మరణ సభ నిర్వహించారు. ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, అధ్యక్షుడు కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సింహాచలంలో జన్మించి, బీవీకే కళాశాలలో డిగ్రీ చదివి, గేయ రచయితగా పేరు సంపాదించారని కొనియాడారు. కులశేఖర్ గురువు వై.సత్యారావు మాటాడుతూ కులశేఖర్ చాలా చురుకైన విద్యార్థి అని, ఆయన ప్రతిభ గుర్తించి సిరివెన్నెల సీతారామ శాస్త్రికి సిఫారసు చేశానన్నారు. అనతి కాలంలోనే కీర్తి గడించాడన్నారు. సహ విద్యార్థి లోగిస లక్ష్మీనాయుడు మాట్లాడుతూ సుమారు వందకు పైగా పాటలు రాసి బహుముఖ ప్రతిభ కనబరిచారని అన్నారు.